# పార్వతి నోచిన నోము

(కథానిక)

అతన్ని 'పార్వతి మొగుడు' అనే నలుగురూ అనేవారు. అసలు పేరేమిటో ఎవరికీ తెలియదు. ఈ ఊరురావటం, ఇక్కడ ఉండటం పార్వతిని పెళ్ళాడాక జరిగిన సంగతులే. పెళ్ళినాటికి ఏదో చదువుతున్నాడని నలుగురితోనూ చెప్పింది పార్వతితల్లి, అంతా సంతోషించారు పార్వతికి తగిన వరుడు దొరికాడని.

పార్వతి చాలా చురుకైనపిల్ల. కొద్దిపాటి చదువుకుందికూడా. చదువులో మగపిల్లలతో పోటీచేసి వాళ్ళకన్న ఎక్కువమార్కులు సంపాదించేది. తోటిపిల్లలకి, మేష్టర్లకి పార్వతంటే చాలా ఇష్టంగా ఉండేది. కొద్దిమంది ఆమెకు ఫస్టు మార్కులొస్తున్నాయని అసూయ పడేవారు కూడా. అయితేనేం? పార్వతిలా చదవద్దూ! ఊరికే అసూయపడితే వస్తాయా మార్కులు?... అంత చురుకైన పిల్లకి స్కూలుఫైనలేనా దాటకుండానే చదువు మానిపించవలసి వచ్చింది. తండ్రిని నలుగురూ నాలుగుమాటలూ అన్నారు. చాలా తప్పు అని, అందులో పార్వతిలాంటి తెలివైనపిల్లని చదువు మాన్పించటం మరీ తప్పనీ... ఎందరో చెప్పారు తండ్రికి. ఎందరుచెప్తే మాత్రమేం లాభం? ఆయనకు ఇంక చదువుచెప్పించే శక్తిలేదు. మానిపించేశాడు. బయటవాళ్ళకు ఆయన సాధక బాధకాలు ఏం తెలుస్తాయి? మొదట్లో కొంచెం విసుక్కున్నా తర్వాత సర్దుకుపోయారు పార్వతీ, తల్లీకూడా. బడిమానినంత మాత్రాన పార్వతి చదువు పూర్తిగా కట్టిపెట్టలేదు. ఇంట్లోనే కూచుని స్వయంకృషివల్ల ఎన్నో గ్రంథాలు చదివి ఎన్నో విషయాలు గ్రహించింది.

తండ్రి అవస్థను గ్రహించగల శక్తి పార్వతికి ఉంది. తండ్రికి వచ్చే ఆదాయమా తక్కువ, ఇంట్లో ఇంటెడుజనం. వచ్చే జీతంలో ఇందరినీ పోషించటానికే కటకటలాడి పోతున్నాడు ఆయన. ఆ ఎలిమెంటరీస్కూలు మేష్టరీలో వచ్చే జీతం ఎంత అని?...అందులోనూ ఆయనకు ఆడసంతతి ఎక్కువకావటం మరీ బాధగాఉంది. పార్వతే పెద్దపిల్ల, అందరూ గబగబా ఎదిగిపోతున్నారు. ఆయనకు రోజులు బాగుండలేదని కాలచక్రం ఆగదుగా మరి! పిల్లవెనకాల పిల్ల తరుముకు వస్తున్నట్టుగా ఉన్నారు. ఆడపిల్లల పెళ్ళిళ్ళను గురించి తలుచుకుంటే ఆయన ఎంతో బాధపడుతుంటాడు. తను ఇందరు ఆడపిల్లలకు పెళ్ళిళ్ళు చెయ్యగలడా? ఒక్క ఆడపిల్లకి పెళ్ళిచెయ్యడమంటేనే తనస్థితికి వల్లమాలినపనే! అటువంటిది అయిదుగురు ఆడపిల్లలకి—అందులోనూ ఏవ్యవధీ లేకుండా వరసగా—పెళ్ళిళ్ళు చెయ్యటంమాటలా? తనస్థితి అలా ఉన్నప్పుడు ఇంక తను వాళ్ళకి చదువులేం చెప్పించగలడు? "ఇప్పుడు జీతాలు కట్టక్కర్లేదు గదా మీ పిల్లలకి! అలాంటప్పుడు పార్వతిని చదువు ఎందుకు మానిపించావు?" అని అడిగాడు సోమనాథం. పాపం! సోమనాథానికేం తెలుసు?...చదువంటే ఒక్క జీతంతోనే ఉందా? జీతంకట్టక్కర్లేకపోతే మిగతఖర్చులన్నీ ఎవరు భరిస్తారు? ఆమాటకొస్తే మిగతఖర్చులముందు జీతం ఒకఖర్చా? ప్రభుత్వం జీతాలవిషయంలో సాయంచేసినా తను పార్వతిని చదివించలేకపోయాడు. తన స్థితి అల్లాఉంది...తనకు మాత్రం తెలియదూ?... పార్వతి ఎంత తెలివైనదో!... అయితేనేం? పరిస్థితులు అల్లా ఉన్నాయి.

పార్వతిచాలా జాగ్రత్తయిన మనిషి. బాగా గడుపుకుంటుంది. తను ఏ బట్టలు కుట్టిస్తే అవ్వే కట్టుకుంటుంది. 'ఇదికావాలి' అని ఎప్పుడూ పేచీ పెట్టి ఎరుగదు. మరి అలా గడుపుకుంటుంది గదా అని బళ్ళోకికూడా ఆ బట్టలతోనే వెళ్ళమనటం ధర్మమా? అక్కడదాన్ని తోటిపిల్లలంతా గేలి చెయ్యరూ? అలా పార్వతిని బాధపెట్టడం ఇష్టం

మధిర భానుమూర్తి

లేదు ఆయనకు. ఆ బాధలేమిటో తనకు తెలుసు. ఆయన చిన్నతనంలో కూడా లేమితో బాధపడ్డ వాడే! కొంచెం మాసినచొక్కా తొడుక్కుని వచ్చినవాళ్ళనే పిల్లలు ఎంతో ఏడిపించేవారు. తన ప్రాణానికి చిరుగులు అతికినచొక్కా ఉంటేనే ఎంతో ఘనంగా వుండేది...మిగిలిన పిల్లలకేం తెలుస్తాయి తన సంగతులు?...అతుకుల చొక్కాలని తననిమరీ ఏడిపించేవారు... ఈ బాధలన్నీ తెలిసిఉండి తన పిల్లని శుభ్రమైన బట్టలులేనిదే బళ్ళోకిపంపటం ఆయనకు ఇష్టంలేదు. అందుచేతే పార్వతిని బడి మానిపించారు. ఇప్పుడు ఇంట్లోనే ఉండడం గనక ఏదో ఉన్నవాటితో కాలక్షేపం చేస్తుంది పార్వతి ఉన్న రెండు మంచి జతలూ వీధిలోకి వెళ్ళేటప్పుడు కట్టుకుంటుంది.

చదువు మానిపించిన మరునాటినుంచే పార్వతికి పెళ్ళిసంబంధాలు వెదకటం ప్రారంభించాడు. పెళ్లంటే మాటలతో!అయేపనా?మహామహాడబ్బున్న వాళ్ళకే ఎక్కడా సంబంధాలు కుదరటంలేదు. ఇంక తన మాటేమిటి? తనేమన్నా విచ్చలవిడిగా డబ్బు చిమ్మగలడా ఏమన్నానా? తను ఎంతో జాగ్రత్తగా ఇన్నాళ్ళనుంచి పార్వతి పెళ్ళికని దాచిన వెయ్యిరూపాయలలో మూడువందల రూపాయలు పెళ్ళికొడుకుని వెదకటానికి ఖర్చయిపోయింది. ఎవరో ఒకరువచ్చి ఏ ఊళ్ళోనో పెళ్ళికొడుకున్నాడనటం, తను వెంటనే బయలుదేరి అక్కడకు వెళ్ళటం, ఇంతాచేసి అక్కడకు వెళ్ళాక ఆ సంబంధానికి ఏదోవంక ఉందని తెలియటం, చూస్తూ చూస్తూ కూతురు గొంతు కొయ్యలేక తను వెంటనే ఇంటిముఖం పట్టడం... ఇలా జరిగేది. కొన్ని సంబంధాల విషయంలో అన్నీకుదిరి ఏ లాంఛనాల దగ్గరో చెడిపోవడం జరిగేది. ఏ మంత స్థితిమంతుడని లాంఛనాలన్నీ యథావిధిగా జరిపించగలడు?...పోనీ పార్వతి పెళ్ళికి ఏ తలో తాకట్టుపెట్టి తెచ్చాడే అందాం. అంతటితో వదులుతుందా?...తరువాత వచ్చే అల్లుళ్ళంతా కూడా పెద్దపిల్ల అత్తవారికి చేసినన్ని మర్యాదలు చెయ్యాలని పట్టుబట్టరూ?—అలా ఎందరికని చెయ్యగలడు? ఇప్పటికి అయిదుగురు ఆడపిల్లలాయిరి! ఇంకా తనుకని పెంచుతున్న వాడే నాయె! అయినా, తన ఖర్మకాకపోతే... ఇందరు పిల్లలేమిటి? తోటి సోమనాథానికి—తనకీ ఒకటే వయస్సు — అసలు పిల్లలు లేకపోవడమేమిటి? సోమనాథం వ్రతాలు, పూజలు ఎన్ని చేస్తున్నాడు పిల్లలకోసం?...వాడికి పిల్లలులేరు. వద్దు మొర్రో—పోషించలేను అనే తనకి పిల్లలు—ఇది భగవంతుడి మాయ... మొత్తానికి ఏమయితేనేం?...రెండేళ్ళయినా తిరిగాడు సంబంధాల కోసమని. తిరిగి తిరిగి విసుగెత్తిపోయింది. తనకి నచ్చిన సంబంధంగదా అని తీసుకువస్తే వాళ్ళకి పిల్లనచ్చదు. వాళ్ళు చేసుకునేటట్టుగా ఉంటే తనకి ఆ సంబంధం నచ్చటంలేదు. కారణమేమయితేనేం?...పెళ్ళిమాత్రం ఓ పట్టాన కుదరలేదు.

ఒకరోజున సోమనాథమే చెప్పాడు ఈ సంబంధం గురించి, సోమనాథం మేనకోడలు కోసమని సంబంధాలు వెదకటంలో ఈ సంబంధం ఆచూకీ తెలిసిందట. వాళ్ళస్థితికి తగినంత ఆస్థిలేదని పార్వతి తండ్రికి చెప్పాడు ఈ సంబంధంగురించి సోమనాథంగారు. పిల్లాడు ఏదో చదువుతున్నాడని, కొద్దిపాటి ఆస్థికూడా—అంత ఎక్కువ కాకపోయినా ఉన్నదని, పిల్లాడి తండ్రికూడా ఎక్కడో ఉద్యోగం చేసుకుంటున్నాడని...వివరాలన్నీ చెప్పారు. అయితే కుర్రాడు స్కూలుఫైనలు తప్పాడట. ఇంటి దగ్గరే ఉండి అక్టోబరుకి కడుతున్నాడట. అది వినగానే కొంచెం వెనక్కిలాగాడు పార్వతి తండ్రి మొదట. కాని తను ఇన్నాళ్ళుగా తిరిగి తిరిగి ఏ ఒక్క సంబంధాన్ని స్థిరపరచలేకపోవడం గుర్తుకువచ్చి "నారుపోసినవాడు నీరుపొయ్యడా! వాడిరోజులు చక్కబడి, ఏదో పరీక్ష అయిందనిపించుకుని, నౌకరీ సంపాదించుకుంటే రెండుపొట్టలు పోసుకోలేకపోతాడా?" అని ఆలోచించి ఆ సంబంధానికని ప్రయత్నించాడు ఆయన.

పెళ్లిచూపులకి పెద్దకొడుకు, తండ్రి, తల్లి, స్నేహితులు వగైరాలతో సహా ఏ డెనమండుగురు వచ్చారు. వందరూపాయలదాకా అయింది ఖర్చు. అయితే ఆ ఖర్చులేమీ ఆయనంతగా లెక్కచెయ్యలేదు. కారణం?—ఆ సంబంధం కుదరటమే. అట్టే భేషజాలు లేకుండా పిల్లనిచూసిన తక్షణమే తప్పకుండా చేసుకుంటామన్నారు వాళ్ళు. అప్పుడు పార్వతి తండ్రికి కలిగిన ఆనందం అంతా ఇంతా

కాదు. పార్వతి పెళ్ళి నిశ్చయమయినట్టు ఆ సాయంత్రానికే ఆయన అందరితోనూ చెప్పాడు. తనుకూడా జీవితంలో ఒక మహత్తరకార్యం సాధించగలిగినందుకు ఎంతగానో గర్వించాడు. ఆయన మనస్సులో ఉన్న వ్యధ తగ్గింది. అప్పటికి ఆయన ముఖంలో సంతోషరేఖ కనిపించింది. ఆ సంతోషంలో పార్వతి వివాహానికి ఏర్పాట్లన్నీ మంచి ఖుంజాయింపుగా చేయించాడు.

అనుకున్నట్లుగానే పార్వతి పెళ్ళి జరిగిపోయింది. చుట్టాలంతా వచ్చారు. పెళ్ళివారుకూడా పేచీ లేమీ లేకుండానే కాలక్షేపం చేశారు. పెళ్ళి కొడుకు యోగ్యుడని పదిమందీ అన్నారు. "కొంచెం ఆలస్యమయినా మంచి అల్లుణ్ణి సంపాదించా వయ్యా" అని పార్వతి ఈడు పిల్లలు పెళ్ళికున్న తండ్రులు పార్వతి తండ్రిని అభినందించారు. ఆ ఊరి అమ్మలక్కలంతా పార్వతి మొగుడి గుణ గణాలను గురించి వేనోళ్ళ పొగిడారు.

ఇన్ని ప్రశంసలు పొందిన పెళ్ళికొడుకు పెళ్ళ యిన నెలే అత్తవారిఊరు ఏదో పనిమీద వచ్చాడు. అత్తవారింట్లోనే ఉండి చూసుకుంటున్న వాడు తనఅత్తగారి నిర్బంధంవల్లనే నాలుగురోజులు ఆగాడు. ఆ వూళ్ళో ఇక వెళ్ళిపోదాంమంటుండగా ఇంకొకపనేదో తగిలింది. ఆ ఉండడం ఉండడం అప్పటినుంచీ ఇక్కడే ఉండిపోయాడు. మరి అతని చదువు ఏమయిందో, ఉద్యోగం మాటేమిటో ఇక్కడనుండి ఎప్పుడు వెడతాడో లేకపోతే అసలు వెళ్ళనే వెళ్ళాడో తెలియదు. అతనే ఇక్కడ కాలక్షేపం చేస్తున్నప్పుడు ఇక పార్వతినిఅత్త వారింటికి తీసుకెళ్ళడం అనేప్రశ్నే రాదుగా!... ఇప్పటికి అతనువచ్చి సుమారు ఏడాది దాటు తుంది. ఈ ఊళ్ళో అందరూ అతన్ని 'పార్వతి మొగుడు' అనే అంటారు. అతనిపేరు తెలుసుకునే అవకాశంగాని తెలుసుకోవలసిన అవసరంగా ఎవరికీ కలుగలేదు. అందుచేత అతను పార్వతి మొగుడు గానే చలామణి అయిపోతున్నాడు. ఈ మధ్య వాళ్ళఊరి ఆయన ఒకరు పార్వతిగారింటికి వచ్చి "సుబ్బారావు ఉన్నాడా" అని అడిగితే అసలు సుబ్బారావనే వ్యక్తి ఎవరూ లేదని ఆయింట్లోంచి జవాబిచ్చారు పార్వతి భర్తపేరు సుబ్బారావని తెలియక.

ఈ ఏడాదినుంచీ మళ్ళా పార్వతితండ్రి ముఖంలో వెనుకటి దైన్యం వ్యక్తమాతుంది. ఏదో ఆలోచిస్తున్నట్టుగా ఉంటాడు. పార్వతి భర్త ఏం చేస్తున్నాడని ఎవరేనా ఆయన్ను అడిగితే "ప్రస్తుతం మా పార్వతికి మొగుడుగా ఉంటున్నాడు" అంటాడు.

---

కథానిక

# అర్థంకాని నేరం

"నయాగరా"

దఫేదారు బలరామయ్య జైలు ఆవరణఖుండి లాఠీ వూపుకుంటూ పోతున్నాడు. వాడి ఠీవిని చూస్తూంటే రంగనాథానికీ కన్నుమన సాగింది. ఒక్కుమ్మడిగా జైలు కటకటాలనన్నింటినీ పటా పంచలుచేసి బలరామయ్యమీద దూకి పీక నొక్కెయ్య బుద్ధిపుట్టింది. తోకతొక్కిన తాచులా వున్న రంగనాథానికి వేగంగా అడుగుల్ని వేస్తూ కోపావేశంతో తూలిపోతూన్న దేహాన్ని మొదటి గేటు కటకటాలదగ్గిరికి చేర్చాడు ఎట్లాగో అట్లాగా—అక్కడే నిలబడి రెండోగేటు దాటి పోతున్న బలరామయ్యని చూసాడు. దఫేదారుని చూస్తూంటే రంగనాథం పళ్లు పటపట లాడాయి. చలికాలంకావడంచేతదవడలు లోపలికిపోయాయి.

'దఫేదారుగాడు బయటిగేటు దాటితే లాభం లేద'ని అనుకున్నాడు తనలోతాను. ఈ లోపు గానే వాడిపని పట్టేస్తే బావుండేది. ఇప్పుడు మాత్రం మించుకుపోయిందేముంది? ఇంకా వాడు గేటు దాటలేదు. ఇప్పటికైనా తాను కటకటాల బయటపడితే బలరామయ్య సులభంగా దొరుకు తాడు. ఈ ఆలోచనతోటే రంగనాథం కటకటా లని గట్టిగా పట్టుకొన్నాడు. చువ్వలు మంచు గడ్డల్లా వున్నాయి. వాటిని పట్టుకునేసరికి రంగ నాథం ధైర్యంకూడా ముడుచుకపోయింది. పట్టు సడలింది. మళ్లీ పట్టడానికి ప్రయత్నించాడుకాని చేతులు చలికి వణకిపోయాయి. నరాలన్నీ బిగిసి పోయి కవోష్ణాన్ని ఆశించాయి. పిండారబోసి